క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

దమ్మపేట: స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వర రావును, అశ్వారావుపేట మండలంలోని వేదాంతపురం పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం తిమ్మాపురం గ్రామస్తులు, సర్పంచ్ ప్రసాద్ అధ్యక్షతన దమ్మపేట మండల పరిధిలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామంలో తాగునీటి సమస్యను తెలుపగా, స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

విప్ కృషితోనే పోడు పట్టాలు

గుండాల: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు కృషి ఫలితంగానే నేడు పోడు భూములకు పట్టాలు వచ్చాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తెల్లం భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేగా కాంతారావు రేపు మండలంలో పర్యటించనున్నారని, ఈ పర్యటనలో భాగంగా పోడు భూముల పట్టాల పంపిణీ ఉందన్నారు. పోడు భూముల విషయంలో రేగా కాంతారావు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టి.రాము, గొగ్గెల లక్ష్మీనారాయణ, అటికం నాగేశ్వరావు, పోలెబోయిన వెంకటనర్సు, తాటి క్రిష్ణ, బొమ్మెర సతీష్, రాంబాబు, సుధాకర్, ప్రబాకర్, రాంబాబు, చాట్ల సూర్యనారయణ, జోగ రాంబాబు పాల్గొన్నారు.

సీపీఐ పోరాట ఫలితంగానే..

దుమ్ముగూడెం: పోడుసాగుదారులకు హక్కు పత్రాలు రావడానికి కారణం సీపీఐ పోరాటమేనని ఆర్లగూడెం మాజీ సర్పంచ్ కొర్సా రమేష్ అన్నారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో ఆర్లగూడెం గ్రామంలో పాయం రాజు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ పోరాటం ఫలితంగా ఆర్లగూడెం, కమలాపురం, చుట్టుపక్కల గ్రామాలకు ఈరోజు పోడు భూములకు పట్టాలు వచ్చాయన్నారు. జిల్లా సమితి సభ్యుడు నోముల రామిరెడ్డి, సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్, కోటేశ్వరరావు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వడ్డెర్ల అభివృద్ధికి చొరవ చూపాలి

చండ్రుగొండ: వడ్డెర కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ చూపాలని వడ్డెరసంఘం జిల్లా నాయకుడు ఉప్పతల ఏడుకొండలు కోరారు. మండలకేంద్రం చండ్రుగొండలో వడ్డెర్లసంఘం ఆత్మగౌరవ సమూదాయ ట్రస్టు సమావేశం ఆదివారం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 200 మంది ప్రతినిధులు పాల్గొని వడ్డెర్ల అభివృద్ధిపై చర్చించారు. సమావేశంలో సంఘం నాయకులు కుంచెపు కాశీ, దండుగుల సాంబశివరావు, జానకీరాములు, భూపాల్, కృష్ణ, రాములు, గోపాల్ పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

దమ్మపేట: తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు యార్లగడ్డ భాస్కరరావు కోరారు. ఆదివారం దమ్మపేట మండల కేంద్రంలో ఏఐటీయూసీ అనుబంధ పంచాయతీ కార్మికులు మండల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా నాయకులు యార్లగడ్డ భాస్కరరావు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు కనీస వేతనంగా రూ.24 వేలు ప్రకటించి, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు ఈ నెల 6వ తేదీ నుంచి సమ్మె చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తంగెళ్లమూడి శివకృష్ణ, ప్రభాకర్, వెంకటేశ్వరరావు, రాంబాబు, బసవయ్య పాల్గొన్నారు.

బాల్య మిత్రుల వితరణ

అశ్వాపురం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఇసంపల్లి లింగన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. 2008–09 లో అశ్వాపురం జెడ్పీ స్కూల్‌లో పదో తరగతి చదువుకున్న లింగన్న చిన్ననాటి మిత్రులు ఆదివారం లింగన్న దశదినకర్మ కార్యక్రమానికి హాజరై మృతుని కుటుంబసభ్యులకు రూ.30 వేల చెక్కును అందజేసి మిత్రుని కుటుంబానికి అండగా నిలిచారు. కార్యక్రమంలో గొల్లపల్లి నరేష్, మురికిపూడి నాగరాజు, అశోక్, సతీష్, సంపత్, అనిల్, ప్రదీప్, యాకయ్య, గణేష్, సైదులు, దుర్గారావు, నాగరాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇర్పా వెంకటేశ్వర్లు ఆదివారం మణుగూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వెంకటేశ్వర్లుకు రేగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బండ్ల సంధ్యారాణి, మడకం సాధు, మాజీ ఎంపీటీసీ బొర్రా శ్రీను, కోరెం రామారావు, తాటి ఈశ్వర్ పాల్గొన్నారు.

బాల్యానికి బలం.. బాలామృతం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందజేత
- 7 నెలల నుంచి 3 ఏళ్ల వయసున్న పిల్లలు అర్హులు
- బాలామృతం ప్లస్‌తో మరింత ఉపకారం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బాలామృతం ప్లస్‌ను అందజేస్తున్న సీడీపీఓ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: ఆరోగ్య తెలంగాణా లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇందుకోసం మాతా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏడు నెలల నుంచి మూడేండ్ల పిల్లలకు బాలామృతం ప్యాకెట్లను పంపిణీ చేస్తోంది.

దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 173 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో 7 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 602 మంది, బాలామృతం ప్లస్.. మూడు నుంచి ఆరేండ్ల లోపు పిల్లలు 2,483 మంది ఉన్నారు. 754 మంది గర్భిణులు, 602 మంది బాలింతలు ఉన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం కారణంగా కంటి చూపు మందగించడం, చర్మ వ్యాధులు, రక్తహీనత వంటి లక్షణాలు ప్రధానంగా కనిపిస్తుంటాయి. ఈ లోపాలను నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతినెలా క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. దీంతోపాటు బలవర్ధకమైన ఆహారంపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు.

బాలామృతంలో ఏమేం ఉంటాయి..

ఐసీడీఎస్ ప్రవేశపెట్టిన బాలామృతాన్ని 7 నెలల నుంచి మూడేండ్ల మధ్య పిల్లలకు పౌష్టికాహారం కింద అందజేస్తారు. బాలామృతంలో వేయించిన గోధుమ పిండి, వేయించిన శనగపప్పు పిండి, చక్కెర, పాలపొడి, ఇనుము, క్యాల్షియం, విటమిన్లు, ఖనిజ లక్షణాలు ఉంటాయి. 100 గ్రాముల పరిమాణంలో ప్రతిరోజూ 3–5సార్లు పిల్లలకు తినిపించవచ్చు. ఏడాదిలోపు పిల్లలకు బాలామృతాన్ని వేడి నీటిలో కలిపి లడ్డు రూపంలో అందించవచ్చు.

బాలామృతం ప్లస్..

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ప్రస్తుతం అందిస్తున్న బాలామృతం స్థానంలోనే బాలామృతం ప్లస్‌ను ఇస్తున్నారు. చిన్నారుల్లో వయసుకు తగిన బరువు, ఎదుగుదల, ఆకలి లేకపోవడం, మరుగుజ్జుతనంలో ఉండడం, శరీరం పాలిపోయినట్టు, పాదాలకు నీరు రావడం, విసర్జన వ్యవస్థ సరిగా లేకపోవడం వంటి లక్షణాలతో ఇబ్బందిపడే చిన్నారులకు బాలామృతం ప్లస్ అందజేస్తున్నారు.

అందరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



అందరి ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల కోసం ప్రత్యేకంగా బాలామృతం ప్యాకెట్లను సరఫరా చేస్తోంది. పిల్లల్లో ఎదుగుదలను ఎప్పటికప్పుడు గమనిస్తాం. పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తాం..

– విజయమ్మ, అంగన్‌వాడీ టీచర్, భద్రాచలం

బాలామృతం వరంలాంటిది...



ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే బాలామృతం చిన్నారులకు వరం లాంటిది. ఇందులో అనేక పోషకాలు ఉంటాయి. పుట్టిన బిడ్డ నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు బాలామృతం ప్లస్ అందజేస్తున్నాం. చిన్నారులకు ప్రతిరోజూ వంద గ్రాముల బాలామృతం తినిపించాలి. ప్రతినెలా మొదటి తేదీన పిల్లల బరువు ఎత్తును సేకరిస్తారు.

– నవ్యశ్రీ, దుమ్ముగూడెం ప్రాజెక్ట్ సీడీపీఓ

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహన తనిఖీల్లో సూచనలు ఇస్తున్న సీఐ ముత్యం రమేష్

మణుగూరురూరల్: మణుగూరులోని హనుమాన్ టెంపుల్ పీవీకాలనీ క్రాస్ రోడ్డు వద్ద సీఐ ముత్యం రమేష్, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ స్వర్ణ ఆధ్వర్యంలో ఆదివారం సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా మణుగూరు–భద్రాద్రి కొత్తగూడెం వైపు రాకపోకలు సాగిస్తున్న వాహనాలను నిలిపి సంబంధిత ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వారికి ఈ–జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్, ఎంవీఐ స్వర్ణ హెచ్చరించారు. ఈ తనిఖీలో ఎస్సైలు రాజ్‌కుమార్, బట్ట పురుషోత్తం, పోలీస్, ఆర్‌టీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చర్ల: మండలంలో పోలీసులు ఆదివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలిరాగా వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో భాగంగా చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, లక్ష్మీకాలనీ, తాలిపేరు ప్రాజెక్ట్, కలివేరుక్రాస్ రోడ్ తదితర ప్రాంతాల్లో మోహరించిన పోలీసులు వచ్చి పోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి విడిచిపెట్టారు. ఈ తనిఖీల్లో సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

గ్రీన్ భద్రాద్రికి విరాళాలు



పల్లింటి దేశప్పను శాలువాతో సత్కరిస్తున్న గ్రీన్ భద్రాద్రి సభ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం కేంద్రంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న గ్రీన్ భద్రాద్రికి సంస్థ గౌరవ అధ్యక్షుడు పల్లంటి దేశప్ప రూ.5వేలు, సీహెచ్ రామలింగేశ్వరరావు రూ.5వేలు, పర్యావరణ ప్రేమికులు చారుగుళ్ల వెంకట నాగభూషణం రూ.2వేలు, అడబాల వెంకటేశ్వరరావు రూ.2వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. వారికి సంస్థ బాధ్యులు ధన్యవాదాలు తెలిపారు. దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు విస్తరిస్తామన్నారు. అనంతరం గ్రీన్ భద్రాద్రి సభ్యులు దాతలను శాలువాలతో సత్కరించారు.

పశుగ్రాసం కొరత తీరింది!



పెదవాగు ప్రాజెక్ట్ నీటి నిల్వ ప్రాంతంలో పచ్చిక మేస్తున్న గొర్రెల మంద

అశ్వారావుపేటరూరల్: మొన్నటి దాకా పశుగ్రాసం కొరతతో తల్లడిల్లిన మూగ జీవాలకు పచ్చిక మేత అందుబాటులోకి వచ్చింది. ఇటీవలే కురిసిన తొలకరి జల్లులతో బీడు భూములు, చెరువులు, ప్రాజెక్ట్‌లోని ఖాళీ స్థలాల్లో పచ్చిక పెరిగింది. దాంతో మూగ జీవాలకు పశు గ్రాసం పుష్కలంగా దొరుకుతోంది. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్ట్ నీటి నిల్వ ప్రాంతం ఖాళీగా ఉండగా, కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలతో గ్రాసం పెరిగింది. పచ్చని గ్రాసం పెరగడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ఆవులు, గేదెలు, గొర్రె, మేకలు పెదవాగు ప్రాజెక్ట్ నీటి నిల్వ ప్రాంతంలో మేతకు వస్తున్నాయి. ఈ దృశ్యాన్ని శనివారం 'సాక్షి'కెమెరాలో క్లిక్ మనిపించింది.

జనగర్జన సభకు ఆటంకాలు



అశ్వారావుపేటరూరల్: సభకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్న వ్యాన్లు



ములకలపల్లి: పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఆటోలు

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మంలో తలపెట్టిన జనగర్జన సభకు వెళ్తున్న పలు వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో లారీలు, వ్యాన్లు, టాటా ఏస్, ఆటోలు గ్రామాల్లోకి పార్టీ కార్యకర్తలను తరలించేందుకు వెళ్లగా, అశ్వారావుపేట పోలీసులు ఆయా వాహనాలను అడ్డుకున్నారు. కొన్ని వ్యాన్లలో పార్టీ కార్యకర్తలను దింపేసి వాటిని అశ్వారావుపేటకు తరలించారు. దాదాపు 30 వ్యాన్లు, 10 లారీలతోపాటు, ఇతర వాహనాలను పోలీసులు అశ్వారావుపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఖాళీ స్థలానికి తరలించి సభకు వెళ్లకుండా అనుమతులు లేవని రోజంతా తమ అదుపులో ఉంచుకున్నారు. దాంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక రింగ్ రోడ్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా నిరసన ర్యాలీ నిర్వహించి, సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా రోడ్డెక్కి నిరసన ర్యాలీ చేయడంతో దాదాపు గంట పాటు ఉద్రిక్తత నెలకొంది. అదే విధంగా మండలంలోని అనుపాక గ్రామంలో పార్టీ నాయకులు రోడ్డెక్కి ధర్నా చేపట్టారు. అనంతరం పెద్ద సంఖ్యలో కార్లను ఏర్పాటు చేసుకోగా, వాటిల్లోనే పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఖమ్మం సభకు తరలివెళ్లారు.

ములకలపల్లి: కాంగ్రెస్ పార్టీ జనగర్జన సభకు వెళుతున్న ఆటోలను, వాహనాలను స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం ఉదయం నుంచే వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహన పత్రాల పేరుతో తనిఖీ చేస్తు మధ్యాహ్నం వరకు పోలీసులు కాలయాపన చేశారు. జెడ్పీటీసీ సున్నం నాగమణి, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి పోలీసు స్టేషన్‌కు చేరొకొని ఎస్సై సాయికిషోర్‌రెడ్డితో మాట్లాడారు.ఎంవీఐ పరిశీలన తరువాత ఆటోలను బయటకు పంపించారు.

ఆషాఢ బోనాల ఉత్సవాలు



చండ్రుగొండ: ముత్యాలమ్మ దేవత వద్దకు బోనాలతో వెళ్తున్న భక్తులు

అశ్వారావుపేటరూరల్: ఆషాఢ మాసం సందర్భంగా బోనాల ఉత్సవాలను ఆదివారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. మండలంలోని వినాయకపురం గ్రామంలోని రామాలయం వద్ద, అశ్వారావుపేటలోని కొనేరు బజారులో మహిళలు, యువతుల పెద్ద సంఖ్యలో ఆషాఢ బోనాలను ఎత్తుకుని ప్రదర్శనగా ఆలయాల వద్దకు తరలివచ్చారు. ఆలయాల్లో బోనాలతో ప్రదక్షణలు చేసి అమ్మవార్లకు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి, నైవేథ్యాలు సమర్పించారు. బోనాలతో అధిక సంఖ్యలో తరలిరాగా, ఆలయాల వద్ద సందడి నెలకొంది.

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ముత్యాలమ్మతల్లికి ఆదివారం బోనాలను గిరిజనులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతియోటా ఆషాఢ మాసంలో ముత్యాలమ్మ దేవతకు గ్రామస్తులు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు వర్షాలు సమృద్ధిగా కురువాలని మొక్కుకున్నారు.

బూర్గంపాడు: మండల పరిధిలోని గుట్ట లక్ష్మీపురంలో ఆదివారం ఆషాఢ బోనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో మహిళలు అమ్మవారికి ఆషాఢ బోనాలు సమర్పించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, మడకం శ్రీనివాస్, పాయం రాంబాబు, నాగమణి పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



బూర్గంపాడు: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ శ్రీలత, పోడు పట్టాదారులు

బూర్గంపాడు: పోడుభూములకు పట్టాలిచ్చినందుకు కృతజ్ఞతగా ఉప్పుసాక, ఇరవెండి గ్రామాలకు చెందిన పోడు పట్టాదారులు ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయా కార్యక్రమాలలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, ఇరవెండి సర్పంచ్ కొర్సా లక్ష్మి, వల్లూరిపల్లి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: పోడు భూములకు పట్టాలు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ మండల పరిధిలోని మల్లెలమడుగు, తుమ్మలచెరువు, వెంకటాపురం, మిట్టగూడెం, కల్యాణపురం గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ కూనవరం గ్రామ బొడ్రాయి వద్ద సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రేగా కాంతారావుల చిత్రపటానికి మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహరావు ఆధ్వర్యంలో పోడు రైతులు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏనిక ప్రసాద్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు నవీన్‌బాబు, మడివీరన్నబాబు, పిన్నాక వెంకట్రావు, వంక సూరయ్య, ఏనిక సమ్మయ్య, రాములు, చిట్టయ్య, పెంటయ్య, రామచంద్రు, హటియా, వెంకన్న పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

గుంతలతో అవస్థలు



మండలంలోని కొత్తూరు (గుమ్మడవల్లి) నుంచి ఏపీ సరిహద్దు ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం మండలంలోని మేడేపల్లి వంతెన వరకు దాదాపు కిలోమీటరు వరకు ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయి. గడిచిన ఏడాది కాలంగా ఉన్న ఈ గుంతలను స్థానిక రోడ్లు భవనాల శాఖ అధికారులకు పట్టడం లేదు. గజానికో గుంత ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు పడుతున్న కష్టాలు వర్ణాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా స్థానిక ఆ శాఖ అధికారులు పట్టించుకొని గుంతలను పూడ్చాలని కోరుతున్నారు. - అశ్వారావుపేటరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: ఎ.శ్రీనివాస్, ఆర్అండ్‌బీ డీఈ, అశ్వారావుపేట
ఫోన్ నంబర్: 94408 18415

సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



అన్నపురెడ్డిపల్లి: ఖమ్మం సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

చర్ల: ఖమ్మంలో జరిగిన తెలంగాణా జన గర్జనకు సభకు చర్ల మండలంలోని నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి నేతృత్వంలో 100కు పైగా వాహనాల్లో సుమారు 1000 మంది తరలివెళ్లారు. వారిలో ఎంపీపీ కోదండరామయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



గుండాల: ఆళ్లపల్లి మండలం నుంచి..

దమ్మపేట: ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జనగర్జన సభకు, మండలం నుంచి పొంగులేటి శ్రేణులు, కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. బస్సులు ఎక్కువగా అందుబాటులో లేకపోవడంతో డీసీఎంలు, మినీ వ్యాన్‌లు, కార్లలో సభకు తరలివెళ్లారు. పొంగులేటి శ్రేణులతో పాటుగా, కాంగ్రెస్ నాయకులు కూడా సభకు తరలివెళ్లారు.

అన్నపురెడ్డిపల్లి: ఖమ్మం జనగర్జన సభకు మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఆదివారం మండలంలోని అన్నపురెడ్డిపల్లి, రాజాపురం, అబ్బుగూడెం, పెద్దిరెడ్డిగూడెం గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆటోలు, కార్లు, టాటా మ్యాజిక్ వాహనాలలో ఖమ్మంకు భారీగా తరలివెళ్లారు. వారిలో నాయకులు వనమా గాంధీ, బాణావత్ భీముడు, పర్సావెంకటేశ్వర్లు, చల్లా రమేష్, దుబాకుల రాము, మారకాల లక్ష్మారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

చండ్రుగొండ: ఖమ్మంలో నిర్వహించిన కాంగ్రెస్‌పార్టీ జనగర్జన సభకు ఆదివారం జనం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వాహనాలను తనిఖీ చేసి నిలిపివేస్తున్నట్లు సమాచారం ఉన్నప్పటికి ఆటోలు, కార్లు, ఇతర వాహనాల్లో సభకు చేరుకున్నారు.

దుమ్ముగూడెం: ఖమ్మంలో జరుగుతున్న జనగర్జన సభకు మండలం నుండి భారీగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభిమానులు ఆదివారం బయల్దేరి వెళ్లారు. జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లంక శ్రీనివాసరావు అధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఖమ్మం సభను విజయవంతం చేయడానికి తరలివెళ్లారు.

గుండాల: ఖమ్మంలో జరిగిన తెలంగాణ జన గర్జన సభకు గుండాల, ఆళ్లపల్లి మండలాల నుంచి 700 మంది వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానలు తరలివెళ్లారు. కార్లు, మ్యాజిక్, బొలెరో, జీపులు తదితర వాహనాల్లో కాంగ్రెస్ నాయకులు, పొంగులేటి అభిమానులు బయలుదేరి వెళ్లారు.



దుమ్ముగూడెం: వాహనాల్లో ఖమ్మం తరలివెళ్తున్న పొంగులేటి అభిమానులు



చండ్రుగొండ: ఖమ్మం జనగర్జన సభకు వెళ్తున్న జనం



గుండాల: మండలం నుంచి బయలుదేరిన నాయకులు